క్లుప్తంగా

అన్నసమారాధన



గుడివాడ టౌన్: స్థానిక మందపాడులోని నిరాశ్రయుల ఆశ్రమంలో పేదలకు సోమవారం అన్నసమారాధన చేశారు. పట్టణానికి చెందిన పందెళ్ల భారతి, వెంకట నాగేశ్వరరావు వితరణతో రెండుపూట్ల భోజనవసతి ఏర్పాటు చేశారు. నిరాశ్రయుల కేంద్రం మేనేజర్ లంకపల్లి పురుషోత్తం మాట్లాడుతూ ఏ విధమైన ఆదరణలేక ఇక్కడ జీవిస్తున్న నిరాశ్రయులపై సమాజం సానుభూతి కలిగి వీరికి అండగా ఉండాలన్నారు.

నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు



మండవల్లి: పెరికెగూడెంలో ఆటంకంగా ఉన్న చెట్లను తొలగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు సోమవారం విద్యుత్ స్తంభం విరిగి పడింది. దీంతో సర్పంచ్ పెరుమాళ్ల పద్మ పర్యవేక్షణలో వైఎస్సార్ సీపీ నాయకుడు పెరుమాళ్ల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ కొండారెడ్డి, ఏడో వార్డు సభ్యుడు సత్యనారాయణ స్పందించి నూతన స్తంభం ఏర్పాటు చేయించారు.

ఘనంగా యోగా మహోత్సవం



గుడివాడ టౌన్: ప్రభుత్వ సూచనల మేరకు యోగా మహోత్సవం నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ తెలిపారు. స్థానిక కైకాల సత్యనారాయణ మున్సిపల్ కళామందిరంలో సోమవారం యోగా మహోత్సవం జరిపారు. యోగా గురువులు కె.సోమసుందరరావు, వి. లీలావతి ఆధ్వర్యంలో యోగా శిక్షణ ఇచ్చారు. సోలో యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం తదితర అంశాలను సాధన చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, ఎంఈ ఏఎస్ఎన్ ప్రసాద్, ఏసీపీ ఏసుబాబు, సచివాలయ కార్యదర్శులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, మెప్మా, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు ముందస్తు టీకాలు



నందివాడ: పశువులకు వర్షాకాలంలో దొమ్మ వ్యాధి వచ్చే అవకాశం ఉన్నందున పశుసంవర్ధక శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. నందివాడ మండలంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో ఆ వ్యాధి నివారణ టీకా మందును సిద్ధంగా ఉన్నట్టు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ లతశ్రీ తెలిపారు. 5,800 టీకా మందు డోసులను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఒక పశువుకు ఒక టీకా (డోసు) మందు వేస్తామన్నారు. పశువులకు ఈ టీకాలు వేయించే విషయంలో రైతులు శ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ అధికారి మూర్తి, ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై ఆకట్టుకున్న నాటిక



పెదన: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పర్యవేక్షణలో గుడివాడకు చెందిన ఎం.శేఖర్‌బాబు అండ్ పార్టీ ఎయిడ్స్ నియంత్రణపై వీధి నాటికను ప్రదర్శించారు. సోమవారం పట్టణంలోని 18వ వార్డు ఇందిరా కాలనీలో ప్రదర్శించిన ఈ నాటిక స్థానికులను ఆకట్టుకుంది. ప్రజలకు హెచ్ఐవీ నియంత్రణకు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఐసీటీసీ సెంటర్లు, ఏఆర్టీ మందులు, పీపీటీసీ కేంద్రాలు, మొబైల్ ఐసీటీసీ కేంద్రాలు, రక్తదానం తదితర విషయాలపై ఈ నాటిక ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవైఎస్ఎస్ ఎన్జీవో ప్రతినిధి పీఎం.ప్రశాంతి, స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

డ్రెయిన్లు ఇలా.. మురుగు పారేది ఎలా?

- అధ్వానంగా ఏనుగులకోడు, కనకవల్లి డ్రెయిన్లు
- ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నా చర్యలు శూన్యం



గుర్రపుడెక్కతో నిండిన కనకవల్లి డ్రెయిన్

అధ్వానంగా ఏనుగులకోడు డ్రెయిన్

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండలంలో ప్రధాన డ్రెయిన్లు అధ్వానంగా మారాయి. వర్షాకాలంలో ముంపునీరు పారాల్సిన డ్రెయిన్లు గుర్రపుడెక్క, తూటుకాడతో అల్లుకుపోయాయి. ఖరీఫ్ సీజన్ తరుముకొస్తున్నా డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోకపోవటంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. వివరాలలోకి వెళితే.. తోట్లవల్లూరు మండలంలో ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో సుమారు ఎనిమిది వేల ఎకరాలకుపైగా వరి పంటను రైతులు సాగు చేస్తారు. ఆయా పంట పొలాల మధ్యగా ప్రధానంగా ఏనుగులకోడు డ్రెయిన్, కనకవల్లి డ్రెయిన్‌లు ప్రవహిస్తాయి. ఏనుగులకోడు డ్రెయిన్ మండలంలోని రొయ్యూరు నుంచి వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, కుమ్మమూరు, కనకవల్లి మీదుగా పెనమకూరు వరకు, కనకవల్లి డ్రెయిన్ యాకమూరు నుంచి కుమ్మమూరు, కనకవల్లి, పెనమకూరు, వీరంకిలాకు మీదుగా ఐనంపూడి వరకు ప్రవహిస్తాయి.

పేరుకున్న గుర్రపుడెక్క

ఏనుగులకోడు డ్రెయిన్, కనకవల్లి డ్రెయిన్లు గుర్రపుడెక్క, తూటుకాడతో పేరుకుపోయాయి. ఆయా డ్రెయిన్లలో మురుగు నీరు ముందుకు సాగే పరిస్థితి కనిపించటం లేదు. వర్షాకాలంలో వరిపొలాలు ముంపునకు గురైనప్పుడు, ఆ ముంపు నీరు ఆయా డ్రెయిన్ల ద్వారానే బయటకు వెళ్లాల్సి ఉంటుంది. డ్రెయిన్ల ద్వారా ముంపు నీరు సాఫీగా ప్రవహించకపోతే వరి పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపునకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నా గుర్రపుడెక్క తొలగింపులో అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటం సరికాదని అంటున్నారు. వర్షాలకు ముందే ఏనుగులకోడు డ్రెయిన్, కనకవల్లి డ్రెయిన్లలో తూటుకాడ, గుర్రపుడెక్క తొలగించి మురుగునీరు సులభతరంగా ముందుకు పారేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

ఏనుగులకోడు, కనకవల్లి డ్రెయిన్లలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలి. డ్రెయిన్లలో గుర్రపుడెక్క తొలగించనట్లయితే వర్షాకాలంలో వరిపొలాలు ముంపు బారిన పడి, రైతులు నష్టపోయే అవకాశం ఉంది.

– కళ్లం వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, తోట్లవల్లూరు

త్వరలో పనులు ప్రారంభం

ఏనుగులకోడు, కనకవల్లి డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపునకు రూ. 12 లక్షలు మంజూరయ్యాయి. నీటి సంఘాలకు బాధ్యత అప్పగించటంతో త్వరలో ఆయా డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపు పనులు ప్రారంభమవుతాయి.

– మణికంఠ, డ్రెయినేజీ ఏఈఈ

దేశ సమైక్యతను రక్షిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

గుడివాడ టౌన్: దేశ సమైక్యతను రక్షించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎం.హరిబాబు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం పార్టీ పట్టణ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాల పేరుతో సమాజంలో చిచ్చులు రేపుతోందన్నారు. ఈ విధానాన్ని అమలు చేస్తూ లబ్ధిపొందుతుందన్నారు. పహెల్గాం దుర్ఘటనకు మతం రంగు పులమడం దురదృష్టకరమన్నారు. తదనంతరం జరిగిన పరిణామాలలో పాకిస్థాన్–భారత్ యుద్ధాన్ని తానే నివారించానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం విచిత్రంగా ఉందన్నారు. ఈ ప్రకటనపై దేశ ప్రధాని నరేంద్రమోదీ నోరు మెదపకపోవడం వెనుక రహస్యం ప్రజలకు తెలియాలన్నారు. హెచ్–1 వీసా ముగిసిన భారతీయులను అమెరికా సంకెళ్లు వేసి దేశానికి పంపిస్తే ప్రధాని నరేంద్రమోదీ నిరసన కూడా తెలపలేదన్నారు. ఉగ్రదాడులను ఎన్నికల ప్రయోజనానికి వాడుకోవడం సిగ్గుచేటన్నారు. మతాలమధ్య వివాదాలు రేపకుండా సమాజసేవకు కేంద్ర ప్రభుత్వం దృష్టిపెట్టాలని, లౌకికవాదాన్ని కాపాడటానికి ప్రజలంతా ఏకం కావాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి, ఐద్వా కార్యదర్శి పి.రజిని, సీపీఎం సభ్యులు ఎల్. సేరేంద్ర, తాజుద్దీన్, శివ నాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని అందరం వ్యతిరేకించాల్సిందే



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు నరసింహారావు

పామర్రు: ఉగ్రవాదాన్ని ప్రతిఒక్కరూ తీవ్రంగా వ్యతిరేకించాల్సిందేనని సీపీఎం జిల్లా నాయకుడు వై నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద 'ఉగ్రవాద వ్యతిరేక పోరాటమా–అమెరికాకు లొంగుబాటా' అనే అంశంపై నియోజకవర్గ స్థాయి సమైక్యత సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలందరూ ఐక్యమై ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. తొలుత పార్టీ కార్యాలయం వద్ద మొదట పహెల్గాంలో అమరులైన వారికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు శీలం నారాయణ, గంగాధర ప్రసాద్, విల్సన్, ఇంటి రాజు, మద్దుల బసవయ్య, డి రఘునాథరావు, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శతక పద్యాలపై అవగాహన

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు సోమవారం వేమన, సుమతీ శతక పద్యాల గురించి వివరించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి పద్యాలను చదివి భావాన్ని విద్యార్థులకు వివరించారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో పద్యాలను వల్లి వేయించారు. అనంతరం విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు.

విద్యార్థులకు శిక్షణ

మండవల్లి: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం విద్యార్థులకు బయోడిగ్రేడబుల్ ప్రాడక్ట్స్‌తో ఫొటో ఫ్రేమ్స్ తయారు చేయడంపై శిక్షణ ఇచ్చినట్లు లైబ్రేరియన్ ఎస్కే పర్వీన తెలిపారు.

పామర్రులో..

జమీగొల్వేపల్లి(పామర్రు): జ్ఞాన సముపార్జనకు గ్రంథ పఠనం సరైన మార్గం అని గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్ పేర్కొన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథ పఠనం కార్యక్రమం నిర్వహించారు.

పామర్రులో..

స్థానిక ద్వితీయశ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా సోమవారం బయాలజీపై కె.సురేష్ బాబుతో విద్యార్థులకు అవగాహన కల్పించామని గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు నీతి కథలు బోధించినట్లు తెలిపారు.



ముదినేపల్లిలో శతకపద్యాలు ఆలపిస్తున్న విద్యార్థులు



ఫొటో ఫ్రేమ్‌లను తయారుచేసిన విద్యార్థులు



పామర్రులో విద్యార్థులకు బయాలజీపై అవగాహన కల్పిస్తున్న సురేష్‌బాబు



కోరుకొల్లులో చదరంగంపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కలిదిండిలో..

కలిదిండి (కైకలూరు): గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. కలిదిండి మండలం కోరుకొల్లు శాఖా గ్రంథాలయంలో సోమవారం చిన్నారులకు చదరంగంలో మెలకువలను నేర్పించారు. అదేవిధంగా పుస్తక పఠనం విలువలను తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాఘవులు, ప్రకాష్ పాల్గొన్నారు.

పబ్లిక్ హెల్త్ యూనిట్ ప్రారంభం



పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

మొవ్వ: స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య పరీక్షల కోసం దూర ప్రాంతాలైన మచిలీపట్నం, ఉయ్యూరు, విజయవాడలోని హాస్పిటల్స్‌కు ఇకపై వెళ్లాల్సిన పని ఉండబోదన్నారు. ఈ యూనిట్లో పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. అవసరమైతే ఈ యూనిట్‌ను అప్ గ్రేడ్ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, తహసీల్దార్ కే మస్తాన్, ఎంపీడీఓ జె.విమాదేవి, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధరాజు, ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, మండల వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ రాజేశ్వరి, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఎంవీఆర్ కేఎస్ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: భారీ వర్షాలు, ఇతర కారణాల వలన ఏర్పడిన సమస్యల పరిష్కారం నిమిత్తం విద్యుత్ లైన్‌లు మరమ్మతు చేయాల్సి ఉందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రమాదకరంగా మర్రివాడ వంతెన



ప్రమాదకరంగా ఉన్న మర్రివాడ వంతెన

పమిడిముక్కల: మర్రివాడ వద్ద రైవస్ కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెనకు ఇరువైపులా రంధ్రాలు ఏర్పడి, పగుళ్లిచ్చి ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనను సుమారు 60 ఏళ్ల క్రితం నిర్మించారు. మర్రివాడ, యలమర్రు మీదగా గుడివాడకు దగ్గరిదారి కావడంతో వంతెనపై నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెనపై కుంగిన, రంధ్రాలు ఏర్పడిన చోట తాత్కాలికంగా తాటిబోదెలు అడ్డు పెట్టారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా రెండు నెలల క్రితం వంతెనను పరిశీలించి అధికారులతో మాట్లాడినా నేటికీ పనులు ప్రారంభించలేదని గ్రామస్తులు తెలిపారు. కాలువకు నీరు వస్తే పనులు ప్రారంభించేందుకు అవకాశం ఉండదని, వంతెన ఎప్పుడు కూలుతుందోనని భయాందోళనలు చెందుతున్నామని చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ఎంపీటీసీ సభ్యురాలు ఊబ మల్లేశ్వరి, ఉపసర్పంచ్ డొక్కు నాగకుమార్, గ్రామస్తులు కోరుతున్నారు.





మర్రివాడ వంతెనపై ఏర్పడిన రంధ్రం, వంతెనపై పగుళ్లిచ్చినచోట అడ్డుగా పెట్టిన తాటిబోదెలు

తాడినాడ తాతకు వందో పుట్టినరోజు



కుటుంబ సభ్యుల మధ్య వందో పుట్టిన రోజు జరుపుకుంటున్న రాజబాబు, దంపతులు

కలిదిండి(కైకలూరు): ఆనందంగా జీవిస్తే అనారోగ్యం దరిచేరదని నిరూపిస్తున్నారు కైకలూరు నియోజకవర్గం తాడినాడకు చెందిన అల్లూరి వెంకటరామరాజు (రాజబాబు). గ్రామంలో తన 100వ పుట్టిన రోజును కుటుంబ సభ్యుల మధ్య సోమవారం ఘనంగా జరుపుకున్నారు. 1925 మే 26న జన్మించిన రాజబాబుకు 1945లో సత్యవతితో వివాహం జరిగింది. వీరికి సంతానం కలగలేదు. వరసకు తమ్ముడు అల్లూరి బంగార్రాజు(బుట్టో రాజు) కుమార్తెలు కునాదిరాజు పద్మావతి, గొట్టుముక్కల గీతా భవానీలను పెంచుకున్నారు. ఈ విధంగా అల్లూరి వంశంలో మనవళ్లు, మనవరాళ్లు, మునిమనవళ్లు, మనవరాళ్ల ఇలా మూడు తరాలను రాజబాబు దంపతులు చూశారు. కుటుంబ సభ్యులందరి సమక్షంలో పుట్టనరోజు కేక్‌ను రాజబాబు దంపతులు కట్ చేశారు.

'స్పందన'కు తొమ్మిది దరఖాస్తులు



ప్రజల సమస్యలు వింటున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్

గుడివాడ టౌన్: ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉద్దేశమని మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావేశం హాలులో పరిష్కార వేదిక నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి తొమ్మిది దరఖాస్తులు వచ్చాయని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, మున్సిపల్ ఇంజినీర్ ఏఎస్ఎం ప్రసాదు, ఏఓ జేటీ నాయుడు, ఏసీపీ వి. ఏసుబాబు పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. స్వామి వారి జన్మనక్షత్రమైన కృత్తికా నక్షత్రం సందర్భంగా ఈ కల్యాణాన్ని నిర్వహించారు. శ్రీవల్లీదేవసేన శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో వేదికపైకి చేర్చి అందంగా అలంకరించి మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ కల్యాణతంతు జరిపారు. అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సహాయ కమిషనర్ ఆర్ గంగాశ్రీదేవి, సిబ్బంది పర్యవేక్షణ చేశారు. స్వామికి 28న లక్షమల్లెల కుసుమార్చన నిర్వహిస్తామని సహాయ కమిషనర్ తెలిపారు. ఇందులో పాల్గొనదలచిన భక్తులు కార్యాలయంలో లేదా సెల్ నంబర్ 99080 65276లో సంప్రదించాలని కోరారు.

గాదిరాజు కుటుంబానికి ఎంపీ వైవీ సుబ్బారెడ్డి పరామర్శ



గాదిరాజు కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చిన వైవీ.సుబ్బారెడ్డి, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు, డీఎన్నార్

కైకలూరు: భైరవపట్నంకు చెందిన గాదిరాజు భాస్కర వర్మ సతీమణి భారతీ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులను సోమవారం రాజ్యసభ ఎంపీ వైవీ.సుబ్బారెడ్డి, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పరామర్శించారు. వీరితో పాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి సయ్యపురాజు గుర్రాజు, రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగ కార్యదర్శి, మండవల్లి ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి మొట్రూ యేసుబాబు, కైకలూరు, మండవల్లి మండలాల పార్టీ అధ్యక్షులు సింగంశెట్టి రాము, బేతపూడి ఏసుబురాజు, నాయకులు బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్, కన్నా రమేష్, అల్లాడ పూర్ణచంద్రరావు, వల్లూరి ఆదినారాయణ ఉన్నారు.

వైభవంగా అమలేశ్వరి దేవి ఉత్సవాలు



అమలేశ్వరి దేవి ఆలయం ముందు ఊరేగింపులో నృత్యం చేస్తున్న భక్తులు

పెదన: మండల పరిధిలోని దావోజీపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న అంకెం వారి ఇలవేల్పు విజయ అమలేశ్వరి దేవి ఉత్సవాలు సోమవారంతో ఐదో రోజుకు చేరాయి. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. 11 సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఈ జాతర ఉత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. 11 రోజులు పాటు అమ్మవారిని రోజుకొక విధంగా అలంకరిస్తున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుని చలినైవేద్యం సమర్పించారు. తాము అనుకున్న కోర్కెలు తీర్చినందుకు కొందరు పురుషులు చీరకట్టుకుని, మరికొందరు చిన్నారులు విచిత్ర వేషధారణలో అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆలయానికి కొందరు మొక్కుబడులు తీర్చుకునేందుకు మేళతాళాలతో ఊరేగింపుగా బయల్దేరి పసుపు, గులాంలు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

జూన్ 5 లోగా ఆధార్ సీడింగ్ చేసుకోవాలి

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం ఆధార్‌కు బ్యాంక్ అకౌంటును అనుసంధానం, ఎన్‌పీసీఐ లింకేజ్ చేసేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని పోస్టల్ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం సమాచారం ఇచ్చినట్టు మచిలీపట్నం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించదలచిన సంక్షేమ పథకాలు తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాల నగదు నేరుగా బ్యాంక్ ఖాతాకు జమ చేసేందుకు ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్ మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. అయితే మన రాష్ట్రంలో సుమారు 51 లక్షల మందికి వారి బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ లేని కారణంగా గత సంవత్సరంలోనే జీఎస్‌డబ్ల్యూఎస్ శాఖ, పోస్టల్ శాఖ సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కొంత పురోగతి సాధించినట్లు చెప్పారు. ఇంకా లబ్ధిదారుల్లో చాలా మందికి ఆధార్ అనుసంధానం కాని కారణంగా పోస్టల్ శాఖను సచివాలయ యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమన్వయంతో జూన్ 5వ తేదీ లోగా అందరికీ ఆధార్ సీడింగ్‌తో పాటు ఎన్‌పీసీఐ లింకేజ్ చేస్తూ ఖాతాలను ఓపెన్ చేయడం ద్వారా సంక్షేమ పథకాల ఫలితాలు ఇబ్బందులేకుండా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. అందువల్ల ఆధార్ సీడింగ్ కాని వారు వెంటనే తమ దగ్గరలోని పోస్టు ఆఫీసును సంప్రదించాలని కోరారు.